సాక్షి
ఏలూరు
గురువారం । 7 । మార్చి । 2024



శివ శివ శంకర..

అఖండ గోదావరి మధ్య ఉన్న పట్టిసం శివక్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. కాలినడకన చేరుకునేలా నదిపై వంట్లు ఏర్పాటు చేశారు. 8లో ▸



ఆకట్టుకున్న 'రాత' నాటిక

పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన రాత నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. 8లో ▸



వైభవంగా ధ్వజారోహణ

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుని ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీఈఓ

కై కలూరు/కలిదిండి: పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని డీఈఓ ఎస్.అబ్రహం అన్నారు. కైకలూరు మండలం గోపవరం, శీతనపల్లి ఎంపీయూపీ స్కూళ్లు, దొడ్డిపట్ల హైస్కూల్, కలిదిండి మండలం కలిదిండి, ఆరుతెగళపాడు, కోరుకొల్లు హైస్కూళ్లను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోపవరంలో లెక్కల సిలబస్ పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కోరుకొల్లు హెచ్‌ఎస్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ) ఉపయోగించకపోవటంపై ఉపాధ్యాయులను మందలించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థకు ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. బైజూస్ ట్యాబ్‌లు విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల హాజరు, సబ్జెక్టు వారీగా పాఠాలు పూర్తి వంటి వివరాలు తెలుసుకున్నారు. కలిదిండి ఎంఈఓ పీపీ ప్రభాకర్‌రావు, హెచ్‌ఎంలు ఉన్నారు.

నృసింహ మహా యజ్ఞం



కలశ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీ రుద్ర సుదర్శన సహిత నృసింహ 30వ మహా యజ్ఞం బుధవారం వైభవంగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 8న రాత్రి యజ్ఞాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజాదికాలు నిర్వహించారు. నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ యజ్ఞ క్రతువును ప్రారంభించారు. ముందుగా యాగశాలలో ఏర్పాటుచేసిన శాలిగ్రామాలకు తులసీదళాలతో రుత్వికులు అర్చనలు చేశారు. సాయంత్రం గర్భాలయంలో రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. అనంతరం యాగశాలలో 1,331 కలశాలను ఏర్పాటు చేసి, నవనారసింహ హోమాన్ని జరిపించారు. గురువారం మహాగణపతి హోమం, శుక్రవారం రాత్రి మహా యజ్ఞం, పూర్ణాహుతి, శనివారం శాంతి కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు గురూజీ తెలిపారు.

ముగిసిన టెట్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో గత నెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు బుధవారం ముగిశాయి. బుధవారం జరిగిన పరీక్షలకు మొత్తం 655 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 365 మందికి 333 మంది హాజరు కాగా 32 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన పరీక్షకు 365 మందికి గాను 322 మంది హాజరు కాగా 43 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 16,177 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న థియరీ పరీక్షలు బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా కేటాయించిన 51 కేంద్రాల్లో మ్యాథ్స్, బోటనీ, సివిక్స్–1 పరీక్షలకు మొత్తం 17,102 మంది విద్యార్థులకు 16,177 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 14,822 మంది జనరల్ విద్యార్థులకు గాను 14,192 మంది హాజరు కాగా 630 మంది గైర్హాజరయ్యారు. అలాగే 2,280 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,985 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా వృత్తివిద్యా అధికారి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బీ ప్రభాకరరావు తెలిపారు.


బలివేకు ప్రత్యేక బస్సులు

నూజివీడు: ప్రముఖ శైవ క్షేత్రమైన బలివేకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నూజివీడు ఆర్టీసీ డిపో నుంచి 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ బుధవారం తెలిపారు. శివరాత్రి పర్వదినం రోజు వేకువజామున 5 గంటల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఏలూరు నుంచి వేల్పుచర్ల మీదుగా బస్సులను నడుపుతున్నామన్నామని డీఎం తెలిపారు.

ఆమెదే అగ్రాసనం

భారతదేశంలో మహిళలది ప్రత్యేక స్థానం. ప్రతి ఇంట్లో అమ్మగా, అక్కగా, చెల్లిగా, భార్యగా, సమాజంలో ఉద్యోగిగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా నేడు మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. మహిళలకు రాజకీయంగా కూడా తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధి కల్పిస్తూ మహిళ సాధికారత సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలన సాగించారు. సర్పంచ్ నుంచి మంత్రి వరకు పాలనలో వారికి పెద్దపీట వేసి గౌరవించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- మహిళా సాధికారత అమలు దిశగా జగన్ పాలన
- మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- రాజకీయ, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ప్రోత్సాహం
- సంక్షేమ పథకాల అమలులో అతివలకు ప్రాధాన్యం
- సర్పంచ్ నుంచి మంత్రి వరకు రాజకీయ ప్రాతినిధ్యం
- 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



భీమవరం (ప్రకాశం చౌక్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళా సాధికారత సమర్థవంతంగా అమలువుతోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిని 90శాతం మహిళలకే అందేలా చర్యలు తీసుకున్నారు. స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడమే కాక ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేశారు. అమ్మ ఒడి, ఆసరా, కాపు నేస్తం తదితర పథకాలు వర్తించేలా చేసి వారిని సమాజంలో గౌరవప్రదంగా నిలబెట్టారు. నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకే లబ్ధి జమ చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చేయూత నివ్వడంతో వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకుంటున్నారు.

రాజకీయంగా ముందడుగు

సీఎం వైఎస్ జగన్ మహిళలను రాజకీయంగా ఎది గేందుకు ఏంతో ప్రోత్సహించారు. సర్పంచ్ పదవి నుంచి ఉప ముఖ్యమంత్రి పదవి వరకు మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి మహిళ పక్షపాతిగా నిలిచారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి తానేటి వనిత హోం శాఖ మంత్రిగా ఉండగా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ,, వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జిగా గూడూరి ఉమబాల, అలాగే ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేషన్ చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లుగా అనేక మంది మహిళలు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేశారు.

మహిళలకు రక్షణగా మహిళా పోలీసు

మహిళలకు కష్టం, ఆపద వస్తే అండగా నిలబడటానికి ప్రభుత్వం ఓ మహిళా పోలీసును రక్షకురాలుగా నియమించింది. ప్రతి వార్డు/గ్రామ సచివాలయానికి మహిళ పోలీసు పేరిట ఉద్యోగం ఇచ్చి తోడుగా నిలిచేలా చేసింది. దిశ లాంటి యాప్‌లను తీసుకువచ్చి మహిళల సత్వర రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకువచ్చింది.

సచివాలయాల్లో మహిళ ఉద్యోగులదే అగ్రభాగం

ప్రజల ముగింటకే సంక్షేమం, అభివృద్ధి అందించడానికి సీఎం వైఎస్ జగన్ తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులలో మహిళలే ఎక్కువ. లక్షలాది ఉద్యోగాల భర్తీలో మహిళలకే ప్రాధాన్యం ఇచ్చారు.

ఉన్నతాధికారిణులుగా విలువైన సేవలు

జిల్లాలోని ఉన్నతాధికారులుగా పలువురు మహిళలు కొలువు తీరి ప్రజలకు సేవలందిస్తున్నారు. పోలీసు శాఖలో జిల్లా సూపరింటెండెంట్‌గా అజిత వెజండ్ల మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన కలెక్టర్ ప్రశాంతి కూడా జిల్లా ప్రజలకు విలువైన సేవలు అందించారు. కొన్ని నెలల పాటు జిల్లా పరిపాలన ఇద్దరు మహిళల ఆధ్వర్యంలో నడిచింది.

నూరు శాతం సాధికారత



మహిళ సాధికారత అనే మాట గతంలో వినడం తప్ప సాధించింది లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో మహిళ సాధికారత నూటికి నూరుశాతం అమలవుతోంది. మహిళలు సంక్షేమ పరంగా, రాజకీయంగా చైతన్యవంతులయ్యారు. రాజకీయ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వడం గొప్ప విషయం. ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది.

– తానేటి వనిత, రాష్ట్ర హోం శాఖ మంత్రి

ఇంకా చైతన్యం రావాలి



మహిళలు రాజకీయంగా ఇంకా చైతన్యవంతులు కావాలి. గృహిణిగా పరిమితం కాక సమాజంలో అన్ని రంగాల్లో ఆమె పాత్ర ఉండాలి. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో సంక్షేమంతోపాటు రాజకీయంగా మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి నాకు కేటాయించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఘంటా పద్మశ్రీ, చైర్‌పర్సన్, ఉమ్మడి జిల్లా పరిషత్

సేవ చేయాలనే లక్ష్యంతో..



ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో రాజకీయల్లో ఉన్న సాధారణ మహిళల ఆకాంక్షలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేరుస్తున్నారు. బీసీ వర్గానికి చెందిన సాధారణ మహిళగా రాజకీయాల్లో ఉన్న నన్ను పార్లమెంట్‌కు పంపించాలని సీఎం తీసుకున్న నిర్ణయం మహిళా సాధికారతకు నిదర్శనం. ఈ అవకాశం నాకు కల్పించడం మహిళందరికి ఆయన ఇచ్చిన గౌరవం.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి

ధైర్యంగా ముందడుగు వేయాలి



మహిళలు ధైర్యంగా ముందడుగు వేసి ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలి. మహిళలు మానసికంగా, ఆరోగ్యంగా పటిష్టంగా ఉండాలి. అప్పుడే అటు కుటుంబానికి, ఇటు సమాజానికి కూడా తన వంతు మేలు చేయగలుగుతుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపదలో ఉన్నవారికి, అన్యాయం జరిగిన మహిళలకు కమిషన్ ద్వారా అండగా నిలుస్తున్నారు.

– బూసి వినీత, మహిళా కమిషన్ సభ్యురాలు

మహిళలకు అమలు చేసిన ప్రభుత్వ పథకాల వివరాలు

పథకం	లబ్ధిదారుల సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
అమ్మ ఒడి	26,46,525	597.62
చేయూత	1,05,779	234.71
ఆసరా	2,56,316	1067.00
కాపు నేస్తం	2,24,286	79.40
ఈబీసీ నేస్తం	12,286	19.02
కల్యాణమస్తు	1,55,821	13.79

పేద మహిళలకు ఆర్థిక చేయూత



పేద మహిళలకు ఆర్థిక చేయూతగా అనేక సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. మహిళలకు ప్రత్యేకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. మహిళలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించడంతో వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. మహిళలు కోరుకున్న విధంగా సీఎం వైఎస్ జగన్ పథకాలు అమలు చేసి ఆదుకుంటున్నారు.

– బి.వెంకటలక్ష్మి, లబ్ధిదారు

24,679 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ లబ్ధి



రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును అందజేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన 24,679 మంది రైతులకు రూ.20.19 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లుల్ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము రైతుల ఖాతాలకు జమ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని రైతులతో కలిసి అధికారులు తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మిచాంగ్ తుపాను కారణంగా 13,178 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందన్నారు. ఇందుకు గాను ఇన్‌పుట్ సబ్సిడీ కింద జిల్లాలో 24,679 మంది రైతులకు రూ.20.19 కోట్ల పెట్టుబడి రాయితీని రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఇందులో మిర్చి, అరటి, ఇతర ఉద్యాన పంటలు 1,309 ఎకరాల్లో దెబ్బతినగా, 1,309 మంది రైతులకు రూ.101.48 లక్షలు పెట్టుబడి రాయితీగా అందించామని చెప్పారు. అనంతరం ఇన్‌పుట్ సబ్సిడీ నమూనా చెక్కును కలెక్టర్ రైతులకు అందజేశారు. అనంతరం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలిజా, వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ తదితరులు

ఏలూరు (మెట్రో): జిల్లాలో సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో వారం రోజులలో కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉందని, అధికారులందరూ ఎన్నికల నిర్వహణపై పూర్తి సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులపై అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలన్నారు. పేర్లు తొలగింపుపై అందిన దరఖాస్తులను ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి పూర్తిస్థాయిలో విచారణ చేసిన తరువాత మాత్రమే ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసేలోగా పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, వాటిలో కనీస ప్రాథమిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాము సందర్శించిన పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలను సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సిబ్బందికి ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పూర్తిగా అవగాహన కలిగేలా శిక్షణ అందించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లు భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల ముద్రణ పూర్తి చేసి, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది వారి ఓటుహక్కు వినియోగించుకునేందుకు సంబంధిత శాఖల అధికారుల ద్వారా పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ప్రజలెవరైనా సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, సి-విజిల్ యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణపై ఆన్‌లైన్‌లో అందిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జేసీ బి.లావణ్యవేణి, డీఆర్ఓ డి.పుష్పమణి, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు, కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు సత్తా చాటాలి

ఏలూరు జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి



మహిళా దినోత్సవంలో ఎస్పీ మేరి ప్రశాంతి, అదనపు ఎస్పీ స్వరూప రాణి

ఏలూరు టౌన్: నేటి ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుకుంటూ అగ్రగాములుగా నిలిచేందుకు పట్టుదలతో కృషి చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరి ప్రశాంతి అన్నారు. ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉద్యోగులు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా పోలీస్ అధికారులు, ఉద్యోగులను ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయంగా 1908లో న్యూయార్క్ నగరంలో 15 వేల మంది మహిళలు, పురుషులతో సమాన వేతనం, హక్కులు, విధులు కల్పించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారని, అనంతరం 1911లో తొలిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారని తెలిపారు. 1975లో ఐక్యరాజ్యసమితి అధికారికంగా మహిళా దినోత్సవాన్ని ప్రకటించినట్లు ఎస్పీ తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తమ ప్రతిభను, సత్తాను చాటుకోవాలని సూచించారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, రంగాల్లోనూ మహిళలు నేడు పురోభివృద్ధి సాధించి పురుషులతో సమానంగా పని చేస్తూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపారు. ఏలూరు జిల్లాలోని మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధి, నిబద్ధతతో పని చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ జీ.స్వరూప రాణి, పోలీస్ ప్రధాన కార్యాలయ మహిళా ఉద్యోగులు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.441 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్



పాఠశాల ప్రతినిధుల నుంచి వివరాలు అడిగి నమోదు చేస్తున్న యనమల నాగార్జున యాదవ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేదలు చదువుకునే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ అన్నారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధి, విద్యాబోధన తీరును పరిశీలించేందుకు ఏలూరు జిల్లా పర్యటనకు వచ్చిన నాగార్జున యాదవ్ జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించి నాడు–నేడు పనులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 రకాలైన మౌలిక వసతులు ప్రతి ప్రభుత్వ బడిలో విధిగా ఉండాలనే ఉన్నత ఆశయంతో నాడు–నేడు ద్వారా ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో 1,469 పాఠశాలల్లో రూ.441 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించారని, ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గతంలో పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లమని, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వ బడుల ముఖచిత్రమే మారిపోయిందని, పాఠశాలలకు ఎన్నో సౌకర్యాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు జిల్లాలోని సత్రంపాడు, కొవ్వలి, గుండుగొలను, ధర్మాజీగూడెం, నూజివీడులలో హైస్కూళ్లను నాగార్జున యాదవ్ బృందం సందర్శించింది. ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ సదాశివరావు, డీఈ కోటేశ్వరావు, ఏఈ భవాని ప్రసాద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా కొనుగోళ్ల ప్రారంభం



జంగారెడ్డిగూడెం కేంద్రంలో వేలం ప్రారంభిస్తున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

జంగారెడ్డిగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్ఎల్ఎస్ పరిధిలో గల ఐదు వర్జీనియా వేలం కేంద్రాల్లో బుధవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో ధర సంతృప్తికరంగా ఉండటంతో రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అధికంగా పండిన పంటకు అపరాధ రుసుము లేకుండా పొగాకును కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కాగా, ఐదు వేలం కేంద్రాల్లో ప్రారంభ ధర కేజీ ఒక్కింటికి రూ.240 లభించింది. జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రంలో 27 బేళ్లు, 2వ వేలం కేంద్రంలో 99 బేళ్లు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం వేలం కేంద్రాలకు 27 బేళ్లు వచ్చాయి. పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం కేంద్రం అధికారులు శ్రీహరి, సురేంద్ర, రైతు నాయకులు కరాటం రెడ్డిబాబు, ఘంటశాల గాంధీ, పరిమి రాంబాబు, వామిశెట్టి హరిబాబు, గద్దే లక్ష్మణరావు, గడ్డమణుకు దత్తుడు, గద్దే ప్రసాద్, సత్రంవెంకట్రావు, వీవీఎస్ ప్రకాశరావు, పిన్నమనేని రాధాకృష్ణ, అట్లూరి సతీష్ పాల్గొన్నారు. ఈ ఏడాది వర్జీనియా వేలం ప్రక్రియ ఆశాజనకంగా ఉంటుందని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో వేలం కేంద్రం–1, 2లలో వేలం ప్రక్రియలో పాల్గొన్న అనంతరం ఈడీ మాట్లాడుతూ గత ఏడాది వర్జీనియా గరిష్ఠ ధరలు నమోదు చేయడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారన్నారు. ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో ప్రస్తుత సీజన్‌లో 66.65 మి.కేజీల పంట పండి ఉంటుందని శ్రీధర్ అంచనా వేశారు.

11న అప్రెంటీస్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈనెల 11న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ఏలూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి పి.రజిత ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఐటీఐ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ మేళా ప్రారంభమవుతుందని, లిక్సిల్ ఇండియా, అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్స్ ఇండియా, నాగ హనుమాన్ ఆగ్రో ఆయిల్స్, దీపక్ నెక్స్‌జన్ తదితర ప్రముఖ సంస్థల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ పాస్, ఫెయిల్ అయిన వారు, ఐటీఐ డిప్లొమా లేదా ఏదైనా వృత్తి విద్య కోర్సు చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ మార్కుల మెమోలు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు తమ కార్యాలయం పనివేళల్లో 08812-230269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

విద్యుత్‌ షాక్‌తో వ్యక్తి మృతి

కలిదిండి: విద్యుత్‌ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందినట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ ఎస్‌డీవీ ప్రసాద్‌ బుధవారం తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన కుందేటి నాగరాజు(38) భార్య శాంత కుమారితో కలిసి తాడినాడ పంచాయతీ పరిధిలో హైస్కూల్‌ దగ్గర రొయ్యల చెరువును లీజుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. బుధవారం ఉదయం చెరువులో రొయ్య పిల్లలను మార్చి చెరువు చుట్టూ తిరిగి వచ్చేటప్పుడు విద్యుత్‌ తీగలు కింద ఉండడం గమనించాడు. వాటిని తీసి కర్రకు కడుతుండగా విద్యుత్‌ షాక్‌నకు గురై కింద పడిపోయాడు. వెంటనే భార్య తాడినాడులో ఆర్‌ఎంపీ వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య శాంతకుమారి ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ తెలిపారు.

బాలికపై వ్యక్తి లైంగిక దాడి

ఏలూరు టౌన్‌: ఏలూరు నగరంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. నగరానికి చెందిన బాలికపై వరుసకు పెద్దనాన్న అయ్యే వ్యక్తే లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఏలూరు దిశ పోలీసు స్టేషన్‌లో నిందితుడి పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు దిశ సీఐ విశ్వం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన 8 ఏళ్ల బాలిక చదువుకుంటుంది. బాలిక ఇంటి సమీపంలో కొద్ది దూరంలోనే బాలిక వరుసకు పెదనాన్న అయ్యే వ్యక్తి కూడా కుటుంబంతో నివాసముంటున్నాడు. బాలికతో సన్నిహితంగా ఉంటున్న ఆ వ్యక్తి ఈనెల 5న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో బాలిక పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తప్పించుకున్న బాలిక తన తల్లికి విషయం చెప్పడంతో ఆమె బుధవారం దిశ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో దిశ పోలీసు స్టేషన్‌ సీఐ విశ్వం బుధవారం నిందితుడి పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

ఎన్నార్పీ అగ్రహారంలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆసక్తి ఉన్న యువత పాల్గొనాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ డాక్టర్‌ ఎస్‌.మల్లికార్జునరావు బుధవారం విలేకరులకు తెలిపారు. తేనెటీగల పెంపకం మంచి లాభదాయకమని ఔత్సాహిక రైతులు, యువత దీనిపై దృష్టి సారిస్తే మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉందన్నారు.

శివ శివ శంకర హరహర శంకర

- శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి
- పట్టిసీమలో ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

పోలవరం రూరల్‌: శివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. ముఖ్యంగా జిల్లాలోని పట్టిసం క్షేత్రానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయని ఉత్సవ కమిటీ చైర్మన్‌, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య అన్నారు. పోలవరం మండలం పట్టిసం శైవ క్షేత్రం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, దర్శనానికి వెళ్లే మార్గాలను, ఇసుక తిన్నెలపై నిర్మించిన చలువ పందిళ్లు ఇతర వస్తువులను పరిశీలించారు. లోటు పాట్లు ఉంటే వెంటనే సరిచేసుకుని వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇసుక తిన్నెలపై భక్తులు నడిచి వెళ్లేందుకు వీలుగా గోనె సంచులతో మార్గాన్ని ఏర్పాటు చేశారు. నది దాటేందుకు వీలుగా నిర్మించిన పంట్లను కూడా ఆయన పరిశీలించారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలవరం డీఎస్పీ ఎస్‌.సురేష్‌కుమార్‌ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టిసం రేవులో సీఐ కె.మధుబాబు, ఎస్సై ఎస్‌ఎస్‌ పవన్‌కు మార్ల ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానం వద్ద ఈఓ ఎస్‌.సంగమేశ్వరశర్మ, ఇసుక తిన్నెలపై సెక్రటరీ టి.విజయలక్ష్మిలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



గోదావరి నదిలో కాలినడకన వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పంటు మార్గం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అద్దయ్య



ఇసుక తిన్నెలపై చిరు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సామగ్రిని తరలిస్తున్న వ్యాపారులు

ప్రకృతి ప్రసాదించిన వరం పట్టిసం శైవక్షేత్రం



పోలవరం రూరల్‌: అఖండ గోదావరి నది మధ్య ఉన్న పట్టిసం శైవక్షేత్రాన్ని ప్రకృతి ప్రసాదించిన వరంగా భక్తులు కొలుస్తారు. ఎత్తయిన కొండ, చుట్టూ గుబురు పొదల మధ్య సహజ సిద్ధంగా వెలిసిన ఈ క్షేత్రం దైవదర్శనంతో పాటు, భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. స్వయం భూ క్షేత్రంగా హరిహరుల ఆదిక్షేత్రను దాటి చెప్పే పవిత్ర లింగోద్భవ సమయాన్ని భక్తులు ఉవావనంతో శివరాత్రి జాగరణ చేస్తారు. పుణ్యక్షేత్రాలు, కాశీ, కేదారం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, పట్టిసాచల క్షేత్రాలు పంచ మహాక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. పట్టిసాచలాన్ని దేవకూటాద్రి, నీలాద్రి వంటి పేర్లతో పిలుస్తారు. పరమ శివుడు వీరేశ్వరస్వామిగా భద్రకాళీ సమేతుడై స్వయం భూగా వెలిశాడు. భూ నీలా సమేత భావన నారాయణ స్వామి క్షేత్రపాలకుడు కావడం ఈ శైవక్షేత్రంలో మరో విశిష్టత. శివకేశవుల ఆరాధన ఈ క్షేత్ర ప్రత్యేకత, కనకదుర్గ, మహిషాసురమర్దని అమ్మవార్లు గ్రామ దేవతలు, వీరభద్రస్వామి పట్టిసం వద్ద అనే ఆయుధంతో దక్షప్రజాపతి శిరస్సు ఖండించి దేవకూటాద్రి పర్వతం పై ప్రళయతాండవం చేశారని, శాంతింపమని దేవతలు వేడుకోగా, లింగాకారంలో స్వయం భూగా ఇక్కడ వెలిశారని స్కంద పురాణం చెబుతోంది.

గజేంద్ర మోక్షం ఇక్కడే

ఈ దేవకూట పర్వతానికి సమీపంలో గజేంద్రుడికి మహావిష్ణువు మోక్షం ప్రసాదించిన ప్రదేశం ఇదే. ఇదే ప్రదేశంలో శ్రీ మహావిష్ణువు కరి, మకరులకు మోక్షం ప్రసాదించారని ప్రతీతి. శాంబవుతుని కోరిక మేరకు దేవ కూట పర్వతంపై భావన నారాయణ స్వామి క్షేత్ర పాలకుడై వెలిశారు. ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని, అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

ఉత్తమ ప్రదర్శనగా రాత నాటిక

పాలకొల్లు సెంట్రల్‌: పాలకొల్లు కళాపరిషత్‌ ఆధ్వర్యంలో జరిగిన 15వ జాతీయస్థాయి నాటికల పోటీల్లో వెంగళరెడ్డి థియేటర్‌ ఆర్ట్స్‌, వెంగళరెడ్డి వారి రాత నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. పాలకొల్లు పట్టణంలోని అద్దేపల్లి గంగరాజు సత్రం ప్రాంగణంలో మూడు రోజులు పాటు నిర్వహించిన పాలకొల్లు కళాపరిషత్‌ 15వ జాతీయ స్థాయి నాటిక పోటీల్లో చివరి రోజు మంగళవారం రాత్రి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న మరికొన్ని నాటికల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శన అభినయ ఆర్ట్స్‌, గుంటూరు వారి ఇంద్రప్రస్థం, తృతీయ ఉత్తమ ప్రదర్శన చైతన్య కళాభారతి కరీంనగర్‌ వారి స్వర్గం రాల్చిన అమృతం నాటికలు గెలుచుకున్నాయి. జ్యూరీ ప్రదర్శన అరవింద్‌ ఆర్ట్స్‌ తాడేపల్లి వారి మనస్విని, ఉత్తమ రచన ఎనిమి, ఉత్తమ దర్శకత్వం రవీంద్ర రెడ్డి ఇంద్రప్రస్థం, ఉత్తమ నటుడు రాత నాటికలో గోవర్ధన్‌ పాత్రదారి పోషించిన శ్రీనివాస్‌, ఉత్తమ నటి రాత నాటికలో స్వప్నిక పాత్రదారి సురభి వాణిబి, ఉత్తమ ప్రతినాయకుడు రాత నాటిక పవన్‌ కల్యాణ్‌, ఉత్తమ హాస్య నటుడు ఎనిమి నాటికలో సురేష్‌, ద్వితీయ ఉత్తమ నటుడు విముక్తి నాటికలో సాంబశివరావు, ఉత్తమ ద్వితీయ నటి మాల్యం నాటికలో జ్యోతిరాజు, ఉత్తమ క్యారెక్టర్‌ ఆర్టిస్ట్‌ ఇంద్రప్రస్థం, రవీంద్ర రెడ్డి, ఉత్తమ క్యారెక్టర్‌ నటి విముక్తి నాటికలో నాగమణి, ఉత్తమ రంగాలంకరణ ఎనిమి, సంగీతం స్వర్గం రాల్చిన అమృతం సురభి నాగరాజు, ఉత్తమ మేకప్‌ రాత, జ్యూరీ బహుమతి ఎనిమి నాటికలో టి.నీతిక బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు రోటరీక్లబ్‌ అధ్యక్షుడు పెనుమాక రామ్మోహనరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాపరిషత్‌ సభ్యులు కేవీ కృష్ణవర్మ, మానాపురం సత్యనారాయణ, వంగా నరసింహారావు, విశాఖుల రమణ, కె గుప్త తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న రామ్మోహనరావు, కళాపరిషత్‌ సభ్యులు

స్త్రీల రక్షణ చట్టాలను వినియోగించుకోవాలి

ఏలూరు (టూటౌన్‌): స్త్రీల అభివృద్ధి, రక్షణ కోసం ఉన్న చట్టాలను సరైన క్రమంలో ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌ కోరారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్‌ సి.పురుషోత్తం కుమార్‌ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో పెదవేగి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్త్రీ సాధికారత అనే అంశంపైన బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్‌ మాట్లాడుతూ బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని కోరారు. మహిళా ఉద్యోగుల రక్షణ నిమిత్తం ప్రతి కార్యాలయంలోనూ కమిటీలు ఏర్పాటు చేయాలని, జిల్లా పరిధిలో జిల్లా కలెక్టర్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు ఉంటాయని మహిళా ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురైనా ఆయా కమిటీల ముందు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ కమిషనర్‌ ఆఫ్‌ లేబర్‌ కె.నాగేశ్వరరావు, ప్యానల్‌ అడ్వకేట్‌ టి.సుబ్బారావు, కూనా కృష్ణారావు, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సెల్‌ ముసునూరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్‌

దివ్యాంగురాలిపై అత్యాచారం

చాట్రాయి: మానసిక వికలాంగ యువతిపై ఇద్దరు మైనర్‌ బాలురు అత్యాచారం చేసిన సంఘటన చాట్రాయిలో చోటు చేసుకుంది. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చాట్రాయి గ్రామానికి చెందిన ఓ మానసిక వికలాంగురాలు (21)పై అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లు మంగళవారం ఇంట్లోకి చొరబడి అత్యాచారం చేశారు. ఆ సమయంలో తల్లి రావడంతో మైనర్లు పారిపోయారు. బాధితురాలి తల్లి బుధవారం ఫిర్యాదును అత్యంఘందంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయమాటలు చెప్పి బంగారం అపహరిస్తున్న వ్యక్తి అరెస్టు

తణుకు: బైక్‌పై తిరుగుతూ రోడ్డుపై మెడలో బంగారంతో తారసపడిన వృద్ధులను మాయమాటలు చెబుతూ వారి మెడలోని బంగారాన్ని తస్కరిస్తున్న యువకుడిని బుధవారం తణుకు పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వేల్పూరు గ్రామానికి చెందిన అందే కోటగణరోహిత్‌ అనే బాలుడిని ఈ నెల 1న ఓ వ్యక్తి మోటారు సైకిల్‌ ఎక్కించుకుని మాయమాటలు చెప్పి మెడలోని బంగారం గొలుసును తీసుకుని ఉడాయించాడు. దీనిపై బాలుడి తండ్రి కోట వీర భద్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్‌ ఎస్సై కె.చంద్రశేఖర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు చెప్పిన గుర్తులతో సీసీ ఫుటేజీ ఆధారంగా ఏలూరు శనివారపుపేటకు చెందిన కాకోను విజయకృష్ణ అలియాస్‌ విజయ్‌ దొంగతనం చేసినట్లు గుర్తించారు. అయితే బుధవారం పైడిపర్రు జంక్షన్‌ వద్ద నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద బంగారు గొలుసుతో పాటు నల్లజర్ల పోలీసు స్టేషన్‌ పరిధిలో ఇదే తరహాలో జరిగిన ఘటనలో అపహరించిన 12 గ్రాముల బంగారు గొలుసు, ఉంగరం, విజయవాడ సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌ పరిధిలో మరో కేసులో చోరీ చేసిన మోటారుసైకిల్‌, పెనుమంట్ర పోలీసు స్టేషన్‌ పరిధిలో దొంగిలించిన 12 గ్రాముల బంగారు గొలుసు మొత్తం 40 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్‌ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్‌ విధించారు. ఈ కేసులో సహకరించిన ఎస్సై చంద్రశేఖర్‌తోపాటు హెడ్‌ కానిస్టేబుళ్లు కేవీ సుబ్బారావు, బందారు శ్రీనివాస్‌, కానిస్టేబుళ్లు వి.మాధవరావు, మలాకా శ్రీను, అన్నర్‌లను సీఐ జీవీవీ నాగేశ్వరరావు అభినందించారు.

మతి స్థిమితం లేని బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

ఏలూరు టౌన్‌: ఏలూరు నగర శివారులోని ఒక ప్రాంతానికి చెందిన మతిస్థిమితంలేని బాలిక పై 70 ఏళ్ల వయస్సున్న వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్‌ పోలీసు స్టేషన్‌లో నిందితుడి పై పోక్సో కేసు నమోదు చేశారు. నగర శివారు లోని ఓ ప్రాంతానికి చెందిన బాలికకు మానసిక స్థితి సరిగ్గా ఉండదు. తల్లిదండ్రులు కూలిపనులకు వెళ్లడంతో బాలిక ఒంటరిగా ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన వృద్ధుడు పెద్దింటి కనకరాజు బాలిక ఒంటరిగా ఉండటాన్ని గమనించి జామకాయలు కొనిస్తానంటూ ఆశ చూపించి ఇంటి పక్క సందులోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పని నుంచి వచ్చిన తల్లిదండ్రులు విషయం తెలుసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఏలూరు రూరల్‌ ఎస్సై రాజారెడ్డి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తత అవసరం

ఏలూరు టౌన్‌: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రజలకు సౌకర్యాలు మెరుగయ్యాయని అదే సమయంలో నేరాళ్లకు వరంలా మారిందని ఏలూరు రేంజ్‌ ఐజీ జీవీజీ అశోక్‌ కుమార్‌ అన్నారు. ఏలూరులోని ఐజీ కార్యాలయంలో సైబర్‌ క్రైమ్‌ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాల్‌ పోస్టర్లను ఏలూరు జిల్లా ఎస్పీ డీ. మేరీప్రశాంతితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌ కుమార్‌ మాట్లాడుతూ సైబర్‌ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఖాళీ సమయాల్లో అదనపు ఆదాయం ఆర్జించే అవకాశాల ఇస్తామనేతో జరిగే మోసాలకు ప్రజలు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిరుద్యోగ యువత నిర్వహిస్తూ ప్రాంగణ ఎంపికలు చేస్తున్నట్టు నటిస్తూ భారీగా సొమ్ములు వసూలు చేసి పత్తా లేకుండా పోతున్నారని తెలిపారు. అపరిచితుల వ్యక్తుల నుండి వచ్చే వీడియోకాల్స్‌ లిఫ్ట్‌ చేయకూడదని, వారు నగ్నంగా ఉండగా మీరు చేసిన వీడియోకాల్స్‌ను రికార్డ్‌ చేసి మిమ్మల్ని బ్లాక్‌మెయిల్‌ చేసి డబ్బులు డిమాండ్‌ చేస్తారని, ఇలాంటి వాటిపై ప్రజలు చైతన్యవంతులు కావాలని కోరారు. ఏదైనా ఇబ్బందులు వస్తే సైబర్‌ హెల్ప్‌లైన్‌ నెంబర్‌ 1930కు కాల్‌ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏలూరు సైబర్‌ సెల్‌ సీఐ బీహెచ్‌ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.శ్రీనివాసరావు, సైబర్‌ సెల్‌ ఎస్సై మధురాజు ఉన్నారు. తను లక్ష్యంగా చేసుకుని కొందరు నేరాళ్లు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రాసెసింగ్‌ చార్జీలు, రిజిస్ట్రేషన్‌ ఫీజులు పేరుతో అమాయక యువతను మోసం చేస్తున్నారని చెప్పారు. కొందరు ఏకంగా ఫేక్‌ ఇంటర్వ్యూలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏలూరు రేంజ్‌ ఐజీ అశోక్‌కుమార్‌, ఎస్పీ మేరీ ప్రశాంతి

పాముకాటుతో వార్డు సభ్యురాలి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్‌: మండలంలోని పేరంపేట పంచాయతీ 1వ వార్డు సభ్యురాలు, వైఎస్సార్సీపీ నాయకురాలు రాజానా అంకాలమ్మ (50) బుధవారం పాము కాటుతో మృతి చెందారు. తన మొక్కజొన్న చేలో కండెలు విరిచే పనిలో నిమగ్నమై ఉండగా అంకాలమ్మ పాము కాటుకి గురైంది. ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంకాలమ్మకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంకాలమ్మ కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌ సీపీ డాక్టర్స్‌ వింగ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి కఠారి సీతారాంబాబు, ఉప సర్పంచ్‌ పోల్నాటి శ్రీనివాసరావు పరామర్శించారు.



అంకాలమ్మ

సమాజాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర

ఏలూరు టౌన్‌: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ బి. లావణ్య వేణి అన్నారు. స్థానిక సురేష్‌ చంద్ర బహుగుణ స్కూల్‌ ప్రాంగణంలోని పోలీస్‌ కల్యాణ మండపంలో బుధవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవో అసోసియేషన్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఐసీడీఎస్‌ ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ లావణ్యవేణి మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్‌ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల హక్కులు, విజయాలను గుర్తించేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ గంటా పద్మశ్రీ ప్రసాద్‌, జిల్లా జాయింట్‌ కలెక్టర్‌ బి.లావణ్య వేణి, అసిస్టెంట్‌ ట్రైనింగ్‌ కలెక్టర్‌ శ్రీ పూజ తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ బోర్డ్‌ సభ్యులు బూసి వినీత, రాష్ట్ర ఫుడ్‌ కార్పొరేషన్‌ సభ్యులు గంజిమాల దేవి, అసిస్టెంట్‌ ట్రైనింగ్‌ కలెక్టర్‌ శ్రీ పూజ, డిప్యూటీ కలెక్టర్‌ భాను శ్రీ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నిర్మల దేవి, జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్‌ పద్మశ్రీను సత్కరిస్తున్న మహిళా నేతలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చాట్రాయి: మండలంలోని సూరంపాలెంలో మెయిన్‌ రోడ్డులో ఓ యువకుడు ద్విచక్ర వాహనంతో కల్వర్టును ఢీకొట్టి మృతి చెందాడు. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం ఎన్‌టీఆర్‌ జిల్లా విస్సన్నపేట మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కంచర్ల మణికంఠ(29) మంగళవారం రాత్రి నక్షత్ర లి నుంచి తన ద్విచక్రవాహనంపై నర్సాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో సూరంపాలెం మెయిన్‌ రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును బైక్‌ అదుపు తప్పడంతో ఢీ కొట్టాడు. వెంటనే స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు తమ వాహనంలో విస్సన్నపేట తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.